



అన్నదాతకు.. అండగా



చేనేత కార్మికులందరి కుటుంబాలకు ప్రతి నెలా 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ ఇస్తున్నాను. అది ఈ ఆగస్టు 7 నుంచే అమల్లోకి వస్తుంది.

అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది ఆగస్టు 7న మంగళగిరిలో నిర్వహించిన చేనేత దినోత్సవంలో నేతన్నలకు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి మూడున్నర నెలలు కావస్తున్నా నేతన్నలకు విద్యుత్ ఊరట మాత్రం లభించలేదు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన తొలినాళ్లలో కాస్త హడావుడి చేసిన అధికారులు ఆ తరువాత ఆ ఊసే ఎత్తడం మానేశారు. పథకం గురించి సచివాలయాల చుట్టూ తిరుగుతున్న కార్మికులకు వారు చెప్పే సమాధానాలతో వారంతా నిరాశ చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పథకం అమలు విషయంలో నేతన్నలో అనుమానం, ఆందోళన కనిపిస్తోంది.

నేతన్నల్లో నిరాశ

- మూడున్నర నెలలుగా ఊసే లేని ఉచిత విద్యుత్
- అమలు కాని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- తొలుత హడావుడి.. ఆ తర్వాత ఊసే మరిచిన అధికారులు
- పథకం అమలుపై చేనేతల్లో అనుమానం, ఆందోళన

10 వేలమంది గుర్తింపు

- గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించి జాబితాను సిద్ధం చేశారు.
- పల్నాడు జిల్లాలో 280 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు.
- బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7 వేల పై చిలుకు ఉంది. ఇదంతా సొంత ఇల్లు,మగ్గం కలిగినవారి జాబితా మాత్రమే.

(సత్తెనపల్లి - ఆంధ్రజ్యోతి)

నేతన్నకు ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల జాబితాను సచివాలయ ఉద్యోగులు రెండు నెలల క్రితమే పూర్తి చేశారు. చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయ పర్యవేక్షణలో చేనేత గుర్తింపు కార్డు కలిగి ఉండడం, ఇళ్లలో చేనేత మగ్గం ఉండడం ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇలా మూడు జిల్లాల పరిధిలో సుమారు 10 వేల మంది వరకు చేనేత కార్మికులు ఉచిత విద్యుత్‌కు అర్హత ఉన్నట్లు అధికారులు గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. కాగా మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది షెడ్లులో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా (మిగతా 7లో)

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని.. చెమట చిందించి.. రెక్కల కష్టంతో సాగు చేసి.. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు అండగా ప్రభుత్వం కదిలేందుకు సిద్ధమైంది. ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వం ఏమి చేసింది.. రైతులకు వివిధ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూర్చింది.. రాబోయే రోజుల్లో వారి సంక్షేమానికి ఏ విధంగా కట్టుబడి ఉందో వివరిస్తూ రైతన్నా.. మీ కోసం కార్యక్రమం పేరిట సోమవారం నుంచి యంత్రాంగం రైతుల ఇంటి బాట పట్టనున్నది. అన్నదాతల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోన్న ప్రభుత్వం.. వారి సాదకబాధకాలు తెలుసుకోవడంతో పాటు పథకాలు అందడంలో ఏమైనా జాప్యం జరుగుతోందా, ఇంకా ప్రభుత్వం వైపు నుంచి ఏం చేయాల్సి ఉంది.. అనే అంశాలపై స్వయంగా వారితోనే చర్చించనున్నారు. రైతు సేవా కేంద్రాలు యూనిట్‌గా సోమవారం నుంచి ఈ నెల 29 అంటే శనివారం వరకు ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనున్నది. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమ షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. కార్యక్రమ అమలుకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేలు.. ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి స్వయంగా కలవనున్నారు.

నేటి నుంచి రైతన్నా.. మీ కోసం

- ఆరు రోజులు నిర్వహణకు ప్రణాళికలు
- రైతుల ఇళ్లకు అధికారులు.. ప్రజాప్రతినిధులు
- ఒక్కో ఆర్‌ఎస్కే పరిధిలో రోజుకు 90 ఇళ్ల సందర్శన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలు అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసింది. సాగు పెట్టుబడి ఖర్చుల కోసం రెండు విడతల్లో రూ.14,000 రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన విషయం తెలిసిందే. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసేందుకు మరో వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రైతన్నా- మీకోసం పేరుతో సోమవారం నుంచి నేరుగా రైతులను వారి ఇళ్ల వద్ద కలిసేందుకు సిద్ధమైంది. పంటల సాగులో పంచసూత్రాల అమలుపై అన్నదాతలకు అవగాహన కల్పించడమే రైతన్నా- మీకోసం కార్యక్రమ లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సీఎం రాసిన లేఖతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాన్ని రైతులకు అధికారులు అందించనున్నారు. ఆరు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై రైతుల కు అవగాహన కల్పించి వారి నుంచి అభిప్రాయాలను సేకరిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బృందాన్ని నియమించింది. రైతు సేవా కేంద్రం వ్యవసాయ అసిస్టెంట్ టీమ్ లీడర్‌గా ఉంటారు. వీఆర్‌వో, గ్రామ ఇంజనీరింగ్ సహాయకుడు, గ్రామశక్తి సహాయకుడు, ప్రగతిశీల రైతులు, పీఏసీఎస్, డబ్ల్యూయూఏ, ఎంఎంసీ సభ్యులు ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. రోజుకు 90 రైతు కుటుంబాలను ఆయా బృందాలు కలిసేలా ప్రణాళిక రూపొందించారు.అంటే ఆరు రోజులకు ఒక్కో రైతు సేవా కేంద్రం యూనిట్‌గా 540 రైతు కుటుంబాలను ఆయా బృందాలు (మిగతా 7లో)

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- వంద రోజులు.. వంద గ్రామాల పర్యటనకు శ్రీకారం
- ఎర్రబాలెంలో ప్రారంభమైన.. ప్రజల వద్దకు భాష్యం ప్రవీణ్
- ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు గ్రామంలోనే ఉంటానన్న ఎమ్మెల్యే

క్రోసూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా.. వంద రోజులు వంద గ్రామాలు.. ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ తెలిపారు. ఆదివారం మండలంలోని ఎర్రబాలెంలో ఆదివారం ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల పాటు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రామాల్లోనే ఉండి అన్ని రకాల సమస్యలు తెలుసుకుంటానన్నారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఏ సమస్య అయినా మూడు నెలల్లో కచ్చితంగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో అన్ని గ్రామాల్లో పర్యటించలేకపోయానని, ఇప్పుడు అన్ని గ్రామాల్లో తిరిగి ప్రజలను కలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా తనకు లభించిందన్నారు. 16 నెలల్లో వ్యాపార పరంగా రూ.32 కోట్లు నష్టం వచ్చినప్పటికీ ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. మరో మూడు ఎన్నికల వరకు తాను ఇక్కడే పోటీ చేసి విజయం సాధిస్తానని తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన వారిలో ఇప్పటికే కొంతమంది పదవులు పొందారని, త్వరలో మరో రెండు రాష్ట్ర స్థాయి పదవులు నియోజకవర్గ నాయకులకు లభిస్తాయన్నారు. వాటిలో ఒకటి తప్పనిసరిగా జనసేనకు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు తీరు మార్చుకుని ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, చిత్రంలో ఎమ్మెల్యే నసీర్ తదితరులు

అసెంబ్లీకి వచ్చే ధైర్యం జగన్‌కి లేదు : ఎమ్మెల్యే యార్లగడ్డ

అసెంబ్లీకి వచ్చి సమస్యలపై పోరాడే దమ్ము, ధైర్యం జగన్‌కు గాని, వారి ఎమ్మెల్యేలకు గాని లేదని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట రావు ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా వైసీపీ ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడం సిగ్గు చేటన్నారు. నారా లోకేశ్‌ను 2019 ఎన్నికల సమయంలో అనేక విధాలుగా అవమానించారని, ఇప్పుడు తెలుగులో ఒక గంట సేపు ఆయనతో సమానంగా వైసీపీలో మాట్లాడే సత్తా ఎవరికైనా ఉంటే వారు ముందుకు రావా లని సవాల్ విసిరారు. పాదయాత్ర పేరుతో జగన్ డ్రామాలు ఆడాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, జనసేన నాయకులు యర్రం శెట్టి రామకృష్ణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ జెరీనా, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్ జాన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, టీడీపీ నాయకులు ఏపూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సీసీ డ్రెయిన్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాడు అభివృద్ధి విస్మరణ..
అవినీతికి ఆదరణ

- వైసీపీ నేతలపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి
- రూ.3.42 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

యడ్లపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు అభివృద్ధిని విస్మరించి అవినీతిని ఆదరించారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. యడ్లపాడు మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన సుమారు రూ.3.42 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముందుగా యడ్లపాడులో పర్యటించిన ఆయన రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్లు, రూ.44 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, మైదవోలు, యడ్లపాడు మంచినీటి చెరువుకు ఏర్పాటు చేసిన గ్రావిటీ పైపులైనును ప్రారంభించారు. లింగారావుపాలెంలో రూ.2.23 కోట్లతో చేపట్టిన యడ్లపాడు-లింగారావుపాలెం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఖజానా మొత్తం దోపిడీ చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై దృష్టి పెట్టిందన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పనిచేసిన వారు రోడ్లపై ఏర్పడిన ఒక్క గుంతను కూడా పూడ్చలేదన్నారు. అంతకముందు టీడీపీ ప్రభుత్వంలో టెండర్లు పిలిచిన ఫిరంగిపురం-లింగారావుపాలెం రోడ్డు పనుల్ని కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. మండల కేంద్రమైన యడ్లపాడుకు అన్ని గ్రామాలను అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. బోయపాలెం-చెంఘీజ్‌ఖాన్‌పేట మధ్య రూ.6 కోట్లతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఉన్నవ-బోయపాలెం మధ్య రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. యడ్లపాడులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి జాతీయరహదారి వరకు సీసీ రోడ్డు విస్తరణ, ఇరువైపులా డ్రెయిన్ల నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, నాయకులు కుర్రా రత్తయ్య, కందిమళ్ళ రఘురామారావు, మద్దూరి వీరారెడ్డి, పోపూరి వెంకయ్య, పోపూరి రాఘవయ్య, జరుగుల అంజేశ్వరరావు, మద్దినేని సుబ్బారావు, ముద్దన నాగేశ్వరరావు, పోపూరి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి

మాచర్ల బస్టాండ్ తనిఖీలో జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

మాచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల - శ్రీశైలం రూట్‌లో పాత బస్సును మార్చి కొత్తగా మరో బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మాచర్ల బస్టాండ్‌లో ఆదివారం ఆయన తనిఖీ చేశారు. తొలుత గ్యారేజ్‌ను పరిశీలించి బస్సుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం బస్టాండ్‌కు చేరుకుని ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకంతో రద్దీ పెరిగినందున బస్సుల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. నరసరావుపేటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసును ప్రారంభించాలన్నారు. బస్టాండ్‌లో పరిశుభ్రత లోపాలను గమనించి కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు నాలుగుసార్లు శుభ్రం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పారిశుధ్య సిబ్బందికి పీఎఫ్ సదుపాయం అందించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్గో సిబ్బందితో సమావేశమై వినియోగదారులకు మర్యాదపూర్వక సేవలందించాలని, వచ్చిన వారు కూర్చునే సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. బస్టాండ్లకు పెయింటింగ్ పనులకు ఈ నెలలో టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే రాష్ట్రానికి 1500 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. అనంతరం డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సురేష్‌రెడ్డిని స్థానిక బీజేపీ నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, సీనియర్ నేత కూనిశెట్టి వెంకటేశ్వర్లు, బొగ్గవరపు మస్తాన్‌రావు, పోకూరి కాశీపతి, ప్రధాన కార్యదర్శి యేచూరి సురేష్, ఉపాధ్యక్షుడు మారం వంశీ, శివకోటయ్య, బోయ నాగిరెడ్డి, పీట్ల లక్ష్మణ్, సీరజ్, గణేష్ పాల్గొన్నారు.


మాచర్ల బస్టాండ్ వద్ద మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి


లంకన్నకు ప్రాణ ప్రతిష్ట చేసి గంగధారమడుగుకు తీసుకెళ్తున్న పీఠాధిపతి

కనుల పండువగా కల్లిపాడు

- లంకన్నకు ప్రాణప్రతిష్ట చేసిన పీఠాధిపతి
- ముగిసిన వీరారాధన ఉత్సవాలు

7

వీరారాధన ఉత్సవాల్లో
అపశృతి

విద్యుత్ వైరు తెగిపడి ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

7

బయోడీజిల్ ప్లాంట్‌లో
అగ్నిప్రమాదం

- మంటల్లో చిక్కుకుని వ్యక్తి మృతి... మరొకరికి గాయాలు

-వివరాలు 3లో

ఘనంగా సత్యసాయి జయంతి

నరసరావుపేట లీగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా కార్యక్రమాలు నిర్వహించగా అధికారులు, ఉద్యోగు లు సాయిబాబాకు నివాళులు అర్పించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో ఎస్పీ కృష్ణారావు, సిబ్బంది బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సత్య సాయిబాబా బోధించిన సేవాభావం, ప్రేమ, సమానత్వం వంటి సందేశాలు సమాజానికి మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జేవీ సంతోష్, ఆర్ఐ గోపీనాథ్ సిబ్బంది పాల్గొన్నారు.


సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

కలెక్టరేట్‌లో..

నరసరావుపేట టౌన్: రాష్ట్ర పండుగగా సత్యసాయి బాబా జయంతి నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టరేట్‌లో వేడుకలను డీఆర్వో మురళి ఆధ్వర్యం లో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్ర మంలో ఆర్డీవో మధులత, తహ సీల్దారు కే వేణు గోపాలరావు, క లెక్టరేట్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చదివిన కోర్సులో సాధించిన సీజీపీఏకు మించి విద్యార్థి ఏమి చేయగలడని హైరింగ్ కంపెనీలు చూస్తున్నాయి. కోర్సులో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులు, సాధించిన వ్యక్తిగత నైపుణ్యాలకు ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

- సాంకేతికంగా పురోగమిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ వంటి వాటిని త్వరితగతిన నేర్చుకునే సామర్థ్యం అభ్యర్థికి ఉండాలి.
- బట్టీపట్టి నేర్చుకోవడం కాదు, ప్రాబ్లెమ్ సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్ సామర్థ్యాలు ఉండాలి. క్లిష్టమైన పరిస్థితిని విశ్లేషించి తార్కికంగా ఒక పరిష్కారాన్ని కనుగొనగలగాలి.

క్యాంపస్ నియామకాలు జోరందుకుంటున్నాయి. ఆకర్షణీయమైన వేతనాలతో విద్యార్థులు ఆఫర్లు అందుకుంటున్నట్టు వార్తలు వినవస్తున్నాయి. తొలగింపులే కాదు, ఈ ఏడాది నియామకాలు కూడా ఉంటాయని మెగా ఐటీ కంపెనీలు ప్రకటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌కు సంబంధించి ఇప్పుడు కొనసాగుతున్న ట్రెండ్స్‌ను పరిశీలిస్తే, అకడమిక మెరిట్‌కు తోడు ఇతర నైపుణ్యాల విషయంలో హైరింగ్ కంపెనీలు, అభ్యర్థిని సమగ్రంగా జల్లెడ పడుతున్నాయి. వాటి లోతుల్లోకి వెళితే.....



కోర్ ప్లస్ ఉంటేనే కొలువు

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

- కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ ఉండాలి. ఆలోచనలో స్పష్టత, బృందాల్లో పనిచేయగలిగే చొరవ, సాంకేతిక కర్తవ్య నిర్వహణలోనూ తిరుగులేని వృత్తి నైపుణ్యం తప్పనిసరి.
- సానుకూల ధోరణికి తోడు శిక్షణతో నేర్చుకునే తత్వం ఉన్న అభ్యర్థులకు కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సానుకూల, క్రియాశీల, సహకార ధోరణి గల అభ్యర్థుల కోసం కంపెనీలు ఎదురుచూస్తున్నాయి.

సన్నద్ధతలో భాగంగా

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ప్లేస్‌మెంట్ కోరుకునే అభ్యర్థి ఈ రోజుల్లో ముఖ్యంగా కోర్సు కాలవ్యవధినిబట్టి రెండో లేదంటే మూడో ఏడాదిలోనే సన్నద్ధం కావాలి. అందుకోసం...

- మొదటి రెండేళ్ళలో కనీసం 7.5 శాతం సీజీపీఏ సాధించి ఉండాలి. టాప్ కంపెనీలైతే 8.5కు మించి సీజీపీఏను కోరుకుంటున్నాయి. దీనికి తోడు చేయాలనుకుంటున్న వృత్తి - సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటాసైన్స్, కోర్ ఇంజనీరింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్‌ను బట్టి సంబంధిత ఆన్‌లైన్ కోర్సులు చేయాలి. లేదంటే కనీసం లోతుగా తెలుసుకుని ఉండాలి.
- ఐటీ లేదంటే ఐటీ ఎనేబుల్డ్ సర్వీసులైతే ప్రోగ్రామింగ్ లాంగ్వేజీలకు తోడు డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గోరిథమ్స్ తెలుసుకోవాలి. కోర్ బ్రాంచీలకు సంబంధిత సాఫ్ట్‌వేర్ టూల్స్(ఆటోకాడ్, ఎంఏటీల్యాబ్ వంటివి) తెలుసుకోవాలి. కాలేజీలో ఉండే వివిధ క్లబ్బుల్లో చేరి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి.



టీ ఆకృతి - ప్రొఫెషనల్స్‌ను కంపెనీలు కోరుకుంటున్నాయి. అంటే అడ్డంగా ఒకటి, నిలువుగా మరొకటి గీతలతో టి అక్షరం ఏర్పడుతుంది. ఇక్కడ అడ్డంగా - కోర్ ఏరియాలో - తను చదువుకున్న సబ్జెక్టులో విద్యార్థికి ఉన్న పరిజ్ఞానం. నిలువుగా అంటే మిగిలినవైన కమ్యూనికేషన్, ప్రాబ్లెమ్ సాల్వింగ్, బిజినెస్‌పై అవగాహన వంటివి వస్తాయి.

- చివరి సంవత్సరాల్లో సాంకేతికంగా లోతైన పరిజ్ఞానాన్ని సముపార్జించాలి. టెక్నికల్ ప్లేస్‌మెంట్స్ కోసం లీట్‌కోడ్, గీక్స్‌ఫర్‌గీక్స్, హ్యాకర్‌ర్యాంక్, కోడ్‌చెఫ్ వంటి ప్లాట్‌ఫారాలపై ప్రాక్టీస్ చేయాలి. 250 నుంచి 400 వరకు నాణ్యమైన ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేయగలగాలి.
- ఐటీయేతర సబ్జెక్టులైతే కోర్ సబ్జెక్టుపై పట్టుకు తోడు ప్రాక్టికల్ ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేసి ఉండాలి. కేస్ స్టడీస్‌ని చేపట్టాలి. ప్రత్యేకత అంటే వెబ్ డెవలప్‌మెంట్ కోసం ఎంఈఆర్ఎన్ లేదా పైథాన్ లైబ్రరీలతో ఎంఎల్/ఏఐ లేదా ఆండ్రాయిడ్/ ఐఓఎస్ డెవలప్‌మెంట్ తెలుసుకోవాలి.
- కాలేజీ అసైన్‌మెంట్లు, టెక్నికల్ ప్రాజెక్టులు, రియల్ వరల్డ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, టెక్నికల్ బ్లాగ్ రూపకల్పన, గిట్‌హబ్ ఉపయోగించి టెక్నికల్ రెజ్యూమె రూపకల్పన తప్పనిసరి.
- కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, బిజినెస్ ఈమెయిల్ రైటింగ్, సొంత ఆలోచనలను స్పష్టంగా తెలియజేయగలగడం తప్పనిసరి. అడ్జాసెంట్ స్కిల్స్ అంటే ఉదాహరణకు మెకానికల్ ఇంజనీర్‌కు 3డి ప్రింటింగ్, డిజైన్ సాఫ్ట్‌వేర్ తెలియాలి.
- రెజ్యూమేను కస్టమైజ్ చేసుకోగలగాలి. ఉదాహరణకు ఎస్‌డీఈ అలాగే డేటా అనలిస్ట్ రెజ్యూమేలకు మధ్య తేడా ఉండాలి. ప్రతి పాయింట్‌కు స్టార్ మెథడ్‌ను అవలంబించాలి.
- ప్రామాణిక పుస్తకాలను ఉపయోగించుకుని క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీపై పట్టు సాధించాలి. దాదాపుగా ప్రతి కంపెనీ వీటిపై ఒక టెస్ట్‌ను ఖాయంగా పెడుతోంది.
- హాజరవుతున్న కంపెనీ సమాచారాన్ని బేసిక్స్ నుంచి మరింత లోతుగా తెలుసుకుంటే ప్రయోజనకరం. ఒక కంపెనీలో చేరాలనుకుంటూ దాని గురించి తెలియకపోవడం మంచిది కాదు. కనీస అవగాహన ఉండితీరాలి.
- మాక్ ఇంటర్వ్యూలకు హాజరుకావడం తప్పని సరి. హెచ్‌ఆర్ రౌండ్‌లో తమగురించి కనీసం ఒకటి నుంచి రెండు నిమిషాలు తడుముకోకుండా చెప్పుకోవాలి. బలాలు, బలహీనతలు, అయిదేళ్ళ తరవాత తమను తాము ఎలా చూసుకోవాలని అనుకుంటున్నారు వంటి వాటిపై పక్కాగా సన్నద్ధం కావాలి.
- ఇప్పటి మార్కెట్ అవసరాల విషయానికి వస్తే ఏఐ, ఎంఎల్ సంబంధిత పరిజ్ఞానం, లోతైన అవగాహన తప్పనిసరి. డేటా అనలిటిక్స్ కూడా తెలిసి ఉంటే మరింత ప్రయోజనకరం. క్లౌడ్ కంప్యూటింగ్ బేసిక్స్ తెలియాలి. ఏడబ్ల్యూఎస్, అజ్యూర్ లేదా గూగుల్ క్లౌడ్ తెలిసి ఉండాలి.
- గిగ్ మైండ్ సెట్ అంటే ఇంటర్న్‌షిప్‌నకు సన్నద్ధంగా ఉండాలి. ప్రాజెక్ట్ బేస్డ్, ఫ్రీలాన్స్‌కు రెడీగా ఉండాలి. రెజ్యూమే, నెట్‌వర్క్‌ను సొంతంగా నిర్మించుకోవాలి.
- చివరాఖరుగా ఒక్క విషయం, చదువుతున్న కోర్సులో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులు ఈ రోజు ప్లేస్‌మెంట్స్‌లో పెద్దగా రాణించడం లేదు. సమస్యలను ఊహించి పరిష్కరించగలిగే సత్తాకు తోడు కోర్ డొమైన్‌లో పటిష్ఠమైన పునాది, ప్రాక్టికల్ ప్రాజెక్టుల్లో అనుభవం, తమ ఆలోచనలను స్పష్టంగా చెప్పగలిగే చాకచక్యం, బృందంలో పనిచేయగలిగే చొరవ ఉన్న వారికే అవకాశాలు లభిస్తున్నాయి. రెజ్యూమేకు బదులు పటిష్ఠమైన ప్రొఫైల్‌ను సొంతంగా రూపొందించుకోగలిగే వారికి ఎదురు ఉండదని గట్టిగా చెప్పవచ్చు.



ప్రొఫెసర్ ఎస్.వి. రమణారావు
డైరెక్టర్, ఎస్ఐటీ రాయపూర్

దిక్సూచి

బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన బ్రాంచీల్లో 2700 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి. ఏపీలో 38, తెలంగాణలో 154 ఖాళీలు కూడా వాటిలో కలిపి ఉన్నాయి.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత
ఎంపిక: ఆన్‌లైన్‌లో పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 1
వెబ్‌సైట్: portal https://nats.education.gov.in (Navigate to the "Student Register/Login" section) and NAPS portal https://www.apprenticeshipindia.gov.in

జనరల్ ఇన్సూరెన్స్

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఇండియా 20 యాక్చూరియల్ అప్రెంటిస్‌ల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చూరీస్ ఆఫ్ ఇండియా లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాకల్టీ ఆఫ్ యాక్చూరీస్ నిర్వహించే పరీక్షలో కనీసం రెండు యాక్చూరియల్ సబ్జెక్టులు పాసై ఉండాలి.
స్టయిపెండ్: మొదటి ఏడాది నెలకు రూ.40,000, రెండో ఏడాది నెలకు రూ.45.00 చెల్లిస్తారు. (కనీసం ఏడు యాక్చూరియల్ సబ్జెక్టులు పాసైతే రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్‌గా తీసుకుని రెగ్యులర్ స్కేల్, ఇతర అలవెన్స్‌లు చెల్లిస్తారు.)
ఎంపిక: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఈ మెయిల్ RecruitmentAA@gicre.in ద్వారా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 7
వెబ్‌సైట్: www.gicre.in/images/2025/ Detailed_Advertisement.pdf

మిథానీ

హైదరాబాద్ - కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 30, టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్ 20, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ 160 ఖాళీలు ఉన్నాయి.
అర్హత: పోస్టునుబట్టి సంబంధిత విభాగం/ ట్రేడ్‌లో డిప్లొమా/ గ్రాడ్యుయేట్/ ఐటీఐ ఉత్తీర్ణత
ఎంపిక: విద్యార్హతలో పొందిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్యపరీక్షల ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 10
వెబ్‌సైట్: https://nats.education.gov.in

అప్రెంటిస్‌షిప్

సౌత్ ఈస్ట్రన్ రైల్వే



కోల్‌కతాలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) - సౌత్ ఈస్ట్రన్ రైల్వే పరిధిలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: 1785(ట్రేడులు: ఫిట్టర్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానికల్ డీజిల్, ట్రిమ్మర్, ఎంఎంటీఎం, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, లైనమన్ వంటివి)
వయస్సు: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 15-24 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి.
ఎంపిక: టెన్త్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 17
వెబ్‌సైట్: www.rrcser.co.in.

నార్తరన్ రైల్వే

ఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) - నార్తరన్ రైల్వే పరిధిలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: 4116(ట్రేడులు: ఫిట్టర్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్(జనరల్)/ కార్పెంటర్ మెషినిస్ట్, టర్నర్, మెకానికల్ డీజిల్/మోటార్ వెహికల్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్/వైర్‌మన్ వంటివి)
వయస్సు: డిసెంబర్ 24 నాటికి 15-24 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి.
ఎంపిక: టెన్త్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా
ఆఖరు తేదీ: నవంబర్ 25 నుంచి డిసెంబర్ 24
వెబ్‌సైట్: www.rrcsnr.co.in.

రైట్స్ లిమిటెడ్

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్)లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 146, డిప్లొమా అప్రెంటిస్ 49, ట్రేడ్ అప్రెంటిస్(ఐటీఐ) 57 మొత్తం 252 ఖాళీలు ఉన్నాయి.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/ డిప్లొమా/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 5
వెబ్‌సైట్: https://nats.education.gov.in/ student_type.php; for ITI pass candidates www.apprenticeshipindia.gov.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను 'అఖండ 2: తాండవం' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఆదివారం బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను, నటి సంయుక్త, నిర్మాతలు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ఆదిత్యనాథ్‌కి అఖండ త్రిశూలాన్ని బహూకరించారు.

'రెబల్ సాబ్' వచ్చేశాడు



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ కామెడీ 'ది రాజా సాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి రెబల్ సాబ్...రెబల్ సాబ్.. రొమాంటిక్ రెబల్ సాబ్... వస్తున్నాడు, స్టెప్ ఎ సైడ్..స్టెప్ ఎ సైడ్ అంటూ సాగే మొదటి పాటను ఆదివారం నిర్వహించిన వేడుకలో మేకర్స్ ఆవిష్కరించారు. తమన్ కంపోజ్ చేసిన ఈ పాటలో ప్రభాస్ స్టైలిష్ స్టెప్పులతో అదరగొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'ప్రేక్షకుల కోసమే ప్రభాస్ గారు 12 ఏళ్ల తర్వాత ఇలాంటి పాటలో నటించారు. ముగ్గురు హీరోయిన్లు, ప్రభాస్ గారి నటన, వారి మధ్య కెమిస్ట్రీ స్క్రీన్‌పైనే చూడాలి' అని అన్నారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'జనవరి 9న సినిమా వస్తుందా అనే సందేహాలు కొందరిలో ఉన్నాయి. కచ్చితంగా అదే తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నాం' అని చెప్పారు.

నిరీక్షణ ముగిసింది.. పట్టాలెక్కిన స్పిరిట్!



ప్రభాస్ కథానాయకుడిగా 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాల దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. వారి నిరీక్షణకు తెరదించుతూ ఆదివారం ఈ చిత్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీ సిరీస్ ఫిల్మ్స్, భద్రకాళి పిక్చర్స్ బేనర్లపై భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు ప్రభాస్. త్రిప్తీ డిమ్రీ కథానాయిక. ప్రకాశ్‌రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తొమ్మిది భాషల్లో ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ విడుదల కానుంది. ఎలాంటి విజువల్స్ లేకుండా ప్రభాస్ పుట్టినరోజున విడుదల చేసిన సౌండ్ స్టోరీ' ఆడియో టీజర్ సినిమాలపై అంచనాలను రెట్టింపు చేసిన విషయం తెలిసిందే.



పుట్టిన రోజు బహుమతి

చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఆదివారం అనిల్ రావిపూడి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయనకు అందమైన వాచ్‌ను బహుమతిగా ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు మెగాస్టార్. అనంతరం కేక్ కట్ చేసి బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

'గోదారి గట్టుపైన' తొలి గీతం



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా సుభాష్ చంద్ర తెరకెక్కిస్తోన్న చిత్రం 'గోదారి గట్టుపైన'. జగపతి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ బేనర్‌పై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'చూడు చూడు..' అంటూ సాగే తొలి గీతాన్ని మేకర్స్ ఆవిష్కరించారు. దినేశ్ కాకర్ల రాసిన పాటను హరి చరణ్ ఆలపించారు. నాగ వంశీ కృష్ణ స్వరాలు సమకూర్చారు. మంచి ప్రేమ కథతో పాటు వాణిజ్య హంగులతో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సాయి సంతోష్ సినిమాటోగ్రాఫర్‌గా, అనిల్ కుమార్ పి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.



కార్యసాధకుడిగా నాగచైతన్య

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తిక్ వర్మ దండు ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం నాగచైతన్య పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను, ఫస్ట్ లుక్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'వృషకర్మ'. అంటే కార్యసాధకుడు అని అర్థం. ఇందులో నిధిని అన్వేషించే సాహసికుడిగా శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు నాగచైతన్య. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బేనర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: నవీన్ నూలి, సంగీతం: అజనీశ్ లోక్‌నాథ్.

నేను గర్వపడే చిత్రమిది



రామ్ పోతినేని

'నా కెరీర్‌లో గర్వపడే సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. ఉపేంద్ర గారితో కలసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నా' అని అన్నారు రామ్ పోతినేని. ఆయన కథానాయకుడిగా మహేశ్ బాబు పి తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మించారు. సినిమా ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ వైజాగ్‌లో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర మాట్లాడుతూ 'ఈ సినిమాను చూసిన ప్రతి ఒక్కరు థియేటర్ల నుంచి కాలర్ ఎగరేసుకుంటూ బయటికి వస్తారు. మహేశ్ బాబు గారు సినిమాని అంత అద్భుతంగా తీశారు' అని అన్నారు. 'నవంబరు 27న మీరందరూ సినిమాని థియేటర్లలో తప్పకుండా చూడాలి' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే కోరారు. ఆంధ్రప్రదేశ్ హోం మినిస్టర్ వంగలపూడి అనిత మాట్లాడుతూ ' 'ఆంధ్ర కింగ్ తాలూకా' టైటిల్ వినగానే చాలా కనెక్ట్ అయ్యాను. వైజాగ్ సముద్ర తీరంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. దర్శకుడు మహేశ్ బాబు మాట్లాడుతూ 'ప్రపంచంలో ఎవర్నో ఒకర్ని అభిమానించకుండా ఎవరూ ఉండరు. జీవితంలో ఉండే అన్ని రకాల భావోద్వేగాలను ఒక అభిమాని కోణంలో చూపించే ప్రయత్నం చేశాం' అని చెప్పారు. నిర్మాత రవి శంకర్ మాట్లాడుతూ 'స్టార్ ఫ్యాన్స్ అందరిని కలిపిన చిత్రమిది. అద్భుతంగా ఉంటుంది. అందరూ తప్పకుండా చూడాలి' అని కోరారు.

థియేటర్లలోకి జనతాబార్

కథానాయిక రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం 'జనతా బార్'. రమణ మొగిలి దర్శకత్వం వహిస్తూ, అశ్వర్థ నారాయణతో కలసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 28న 'జనతా బార్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మహిళా అథ్లెట్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారులకు వ్యతిరేకంగా పోరాడిన ఓ మహిళ కథతో తెరకెక్కిన చిత్రమిది. రాయ్ లక్ష్మి పాత్ర శక్తిమంతంగా ఉంటుంది. అమ్మాయిల్లో చైతన్యం నింపే సినిమా ఇది. వాణిజ్య హంగులతో పాటు మంచి సందేశంతో తెరకెక్కింది. బాలీవుడ్ నటుడు శక్తికపూర్ కీలకపాత్ర పోషించారు' అని చెప్పారు.




రమణ గోగుల సంగీత యాత్ర



సంగీత దర్శకుడు, గాయకుడు రమణ గోగుల తన కెరీర్‌లో తొలి సారి 'ఇన్ కాన్వర్సేషన్స్ విత్ ది ట్రావెలింగ్ సోల్జర్ - రమణ గోగుల ఆస్ట్రేలియా టూర్ ఫిబ్రవరి 2026' పేరిట గ్లోబల్ కాన్సర్ట్ టూర్ నిర్వహించనున్నారు. మెల్‌బోర్న్ మామా క్రియేటివ్ స్పేస్, టాప్ నాచ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆస్ట్రేలియా సంస్థలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమణ గోగుల ఈ యాత్ర వివరాలు వెల్లడించారు. ఈ గ్లోబల్ కాన్సర్ట్ టూర్ తెలుగు సంగీత చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని అభిప్రాయపడ్డారు. ఈ టూర్ కేవలం సంగీత కచేరీలకు మాత్రమే పరిమితం కాదనీ, అత్యంత ఆదరణ పొందిన తన సినీ గీతాలు, వాటి వెనుక ఉన్న జ్ఞాపకాలు, తెర వెనుక ఉన్న కథలతో కూడిన ఒక భావోద్వేగభరితమైన అన్వేషణ అని ఆయన తెలిపారు.

ఆకట్టుకునే అమ్మ కథ



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'విచిత్ర'. రవి, శ్రియ తివారి జంటగా నటించారు. సైపుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఆదివారం చిత్ర బృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ సందర్భంగా సైపుద్దీన్‌మాట్లాడుతూ 'అమ్మ సెంటిమెంట్‌తో రూపొందిన చిత్రమిది. తల్లి ప్రేమ, త్యాగం లాంటి అంశాలతో హృదయాన్ని కదిలించేలా ఉంటుంది. పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు' అని చెప్పారు. సంగీతం: నిజాని, అంజన్, ఎడిటర్: లక్ష్మీ నారాయణ.

కనుల పండువగా కల్లిపాడు

● లంకన్నకు ప్రాణప్రతిష్ఠ చేసిన పీఠాధిపతి
●ముగిసిన వీరారాధన ఉత్సవాలు

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో చివరిరోజైన ఆదివారం కల్లిపాడును కనుల పండువగా నిర్వహించారు. కల్లిపాడులో భాగంగా లంకన్నకు ప్రాణ ప్రతిష్ఠ చేసే ఘట్టాన్ని జరిపారు. యుద్ధ భూమిలో ఒరుగు బండపై యాదవ సామాజిక వర్గానికి చెందిన వీరాచారవంతుడు శవంగా తెల్ల బట్టలు కప్పుకొని పడుకొని ఉండగా పైన బాణాలు ఉంచారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు వీరుల సేవా స్థానానికి ఊరేగింపుగా వచ్చి తొలుత కొణతములకు ఊరేగింపు జరిపారు. లంకన్న ఒరిగిన ప్రదేశానికి చేరుకొని ఆనాడు బ్రహ్మనాయుడు తులసితీర్థమిచ్చి ప్రాణ ప్రతిష్ఠ చేసిన విధంగా నాటకీయంగా నిర్వహించారు. వీర విద్యావంతులు లంకన్న ఒరుగు కథను గానం చేస్తుండగా, కొందరు వీరాచార వంతులు కత్తిసేవ చేశారు. వీరాచారవంతుడు వేకువ జామున 4 గంటలకే శవంగా పడుకోగా, మధ్యాహ్నం 2 గంటల వరకు అంతే శవంలా కదలకుండా ఉండడం ఈ కార్యక్రమంలో విశేషం. ఆవుల మంద కాపరి అయిన లంకన్నను నాగమ్మ సైన్యం మట్టుబెట్టగా విష్ణు సంభూతుడైన బ్రహ్మనాయుడు లంకన్నకు తులసితీర్థం ఇచ్చి ప్రాణప్రతిష్ఠ చేసే ఘట్టం నిర్వహించారు. అనంతరం లంకన్నగా ఉన్న వీరాచారవంతుడ్ని నాగులేటిలోని గంగధార మడుగు వద్దకు తీసుకెళ్లి స్నానమాచరింపజేశారు. అనంతరం కొణతములకు గ్రామోత్సవం జరిపారు. చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. వీర్ల దేవాలయం వద్ద కత్తిసేవ చేశారు. ఇలా కల్లిపాడు కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వీరాచార పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


లంకన్నకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు


లంకన్నకు ప్రాణ ప్రతిష్ఠ చేసి గంగధారమడుగుకు తీసుకెళ్తున్న పీఠాధిపతి

ముగిసిన వీరారాధన ఉత్సవాలు

నాలుగు రోజులుగా రాచగావు, రాయబారం, మందపోరు, కోడిపోరులతో నిర్వహించిన వీరారాధన ఉత్సవాలు ఆదివారం కల్లిపాడుతో ముగిశాయి. రాత్రి వేళ బ్రహ్మనాయుడు నృసింహకుంతంతో పాటు దైవాలు (కొణతములు) గ్రామోత్సవంలో చివరిగా ఊరేగింపు నిర్వహించి ఇంటింటి వద్ద హారతులు అందుకున్నారు. కొణతాలకు నూతన వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. పోతురాజు గుట్ట వద్ద తంగెడ మండలపై కొణతములన్నీ ఒరిగాయి. ఈ తంగెడ మండలను ప్రజలు తమ గృహాల గడపల వద్ద కట్టుకున్నారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి.

నేటి నుంచి జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్

ఏఎన్‌యూ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో గుంటూరు జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ ఎంపికలు సోమవారం నుంచి జరుగుతాయని సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్‌ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16 విభాగంలో పతిభ కనబరిచిన బాలికలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకి ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఉదయం 9 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని ఏఎన్‌యూ సింథటిక్ ట్రాక్‌లో రిపోర్టు చేయాలని కోరారు.

కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం


నది ఒడ్డున మృతదేహం

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం నాగార్జున సాగర్ దిగువ కృష్ణా నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ ఆదివారం తెలిపారు. సాగర్ నూతన వంతెన కింద సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి ఉండగా.. స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. తెల్లని చొక్కా, ఖాకీ రంగు ప్యాంటు ఉన్న మృతుని కుడి చేతికి వెంకటేశ్వరస్వామి ఉంగరం ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94409 00884, 94407 96229 నంబర్లను సంప్రదించాలన్నారు.

చేపకేసిన గాలం.. కనురెప్పకు గుచ్చుకుని..


కంటిపై గుచ్చుకున్న గాలం

బాపట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి నక్కల సందీప్ ఆదివారం సెలవుదినం కావడంతో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే సమయంలో గాలం లాగటంతో ముల్లు వచ్చి కంటి రెప్పపై భాగాన లోతుగా దిగబడింది. స్నేహితులు గమనించి ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఆపరేషన్ చేసి గాలం ముల్లు తొలిగించారు. కంటికి ఎటువంటి సమస్య లేదని డాక్టర్ తెలిపారు. పిల్లలు ఆడుకునే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.

వైద్యశాల ఎదుట మహిళ మృతదేహంతో ఆందోళన

వినుకొండటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి మహిళ మృతి చెందిందంటూ బాధిత బంధువులు ఆర్టీసీ సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పటల్ వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... ప్రకాశం జిల్లా.. కురిచేడు మండలం పొట్లపాడు గ్రామానికిచెందిన యాదగిరి యోగయ్య భార్య శ్రీలక్ష్మి(19)కి ఓవర్ బ్లీడింగ్ కావడంతో శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో హాస్పటల్‌కు తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో మందులు ఇచ్చి వారిని ఇంటికి పంపించారు. ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లిన యోగయ్య భార్య శ్రీలక్ష్మిని నూజెండ్ల మండలం చింతలచెరువులోని పుట్టింటి వద్ద ఉంచారు. రాత్రికి టిఫిన్ చేసిన శ్రీలక్ష్మి వైద్యులు ఇచ్చిన మందులు వేసుకుంది. మందులు వేసుకున్న కొద్ది నిమిషాలకే చేతులు, కాళ్లు గుంజుకుపోవడంతో ఆమెను మళ్లీ వినుకొండలోని చికిత్స అందించిన వైద్యశాలకు వద్దకు తీసుకొస్తున్న సమయంలో మార్గ మధ్యంలో మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న బంధువులు వైద్యశాల వద్దకు చేరుకొని వైద్యురాలి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని మృతురాలి బంధువులతో చర్చించారు. వైద్యం అందించడంలో పొరపాటు లేదని, అవసరమైతే కేసు పెట్టుకోవచ్చని వైద్యులు ఖరాఖండిగా చెప్పడంతో.. వైద్యురాలిపై కేసు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీలక్ష్మి మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


పధాన గేటు వద్ద మృతదేహాన్ని ఉంచి బంధువుల నిరసన

అన్నదాతకు.. అండగా

(5వ పేజీ తరువాయి)

కలవనున్నాయి. రోజుకు 90 ఇళ్ల చొప్పున బాపట్ల జిల్లాలో 326 ఆర్ఎస్‌కేల పరిధిలో 29,340 రైతు కుటుంబాల ఇంటికి సిబ్బంది వెళ్లనున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలను కూడా కలుపుకుంటే రోజుకు దాదాపుగా లక్ష మంది అన్నదాతల కుటుంబాల ఇంటి గడప ప్రభుత్వ యంత్రాంగం తొక్కనుంది. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులు కూడా రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు.

పంచ సూత్రాలపై అవగాహన

నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే పంచసూత్రాల విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని సంకల్పించింది. వీటిపై రైతులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా రైతన్నా మీకోసం బృందం అవగాహన కల్పించనున్నది. పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులు, ఆక్వా ఉద్యాన, సెరికల్చర్ రైతులకు కూడా అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, నేల పరీక్ష, సూక్ష్మ నీటి పారుదలలో ఆటోమేషన్, తెగుళ్ల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక, లాట్ ఆధారిత వ్యాధి అంచనా, డ్రోన్ వినియోగం, మామిడి, జామలో పండ్ల సంరక్షణ, అరటిలో గుత్తుల స్లీవ్‌లు, కోతకు ముందు.. కోత తర్వాత సాంకేతికత, మౌలిక సందుపాయాలు కోల్డ్ స్టోరేజ్, ప్యాక్ హౌస్‌లు, రవాణా సౌకర్యాలను రైతులకు వివరించనున్నారు. అదేవిధంగా రైతులు ఏ పంట సాగు చేశారు.. వారికి ఎలాంటి సాయం అవసరమనే విషయాల్ని కూడా నేరుగా తెలుసుకోనున్నారు. సాగులో పురుగు మందుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించనున్నారు. సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు తెలియజేయనున్నారు. ప్రకృతి సేద్యంతో భూసార రక్షణతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని ఈ దిశగా రైతులను చైతన్యపరచనున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను అందిపుచ్చుకుని సాగును లాభసాటి చేసుకునేందుకే పంచ సూత్రాలను ప్రభుత్వం అమలు చేయనుంది.

డిసెంబరు 3న వర్క్‌షాప్

రైతన్నా మీ కోసం కార్యక్రమం అనంతరం డిసెంబరు 3న ఆర్ఎస్‌కేల పరిధిలో వర్క్‌షాప్ నిర్వహించనుంది. రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలు, ప్రస్తుతం ఉన్న దిగుబడులు, ఏయే పంటల విస్తీర్ణం ఎక్కువగా జరిగింది అనే అంశాల ఆధారంగా ప్రస్తుత రబీ యాక్షన్‌ప్లాన్‌తో పాటు వచ్చే ఖరీఫ్, రబీపై రైతులను ఏ విధంగా సన్నద్ధపరచాలనే ప్రణాళికలను ఈ వర్క్‌షాప్‌లో రూపొందించనున్నారు. వ్యవసాయశాఖ సిబ్బందితో అన్నదాతలను కూడా పూర్తి స్థాయిలో ఈ వర్క్‌షాప్‌లో భాగస్వామ్యం చేయనున్నారు. వినూత్న సేద్యంతో లాభాట బాటలో ఉన్న రైతుల విజయగాథలను కూడా వివరించి రైతులకు ప్రేరణ అందించనున్నారు.

నేతన్నల్లో నిరాశ

(5వ పేజీ తరువాయి)

సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఆమోదం ఎప్పుడు?

మూడు జిల్లాలకు చెందిన 10 వేల మంది కార్మికులను గుర్తించి వారి జాబితాను ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖ అధికారులు రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఈ ప్రక్రియ పూర్తై దాదాపు మూడు నెలలు కావస్తోంది. కానీ కమిషనర్ కార్యాలయంలో ఫైలు మాత్రం ముందుకు కదలలేదు. అధికారుల నిర్లక్ష్యమా? ప్రభుత్వ సాచివేత ధోరణా? కారణమేదైనప్పటికీ నేతన్నలు విద్యుత్ భారాన్ని మోయాల్సి వస్తోంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చేనేత కుటుంబాలు బాగా దెబ్బతిన్నాయి. మూడు నెలలపాటు పనులు లేక అప్పులపాలయ్యారు. ఈ విద్యుత్ ఊరట లభిస్తే వారికి కొంతలో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

వీరారాధన ఉత్సవాల్లో అపశృతి

● విద్యుత్ వైరు తెగిపడి ఒకరు మృతి.. మరొకరికి గాయాలు


జాలయ్య మృతదేహం

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కారంపూడిలో జరుగుతున్న వీరారాధన ఉత్సవాల్లో ఆఖరి రోజు ఆదివారం అపశృతి చోటు చేసుకుంది. వీరుల ఆయుధాలను గంగధారమడుగులో శుద్ధి చేసే కార్యక్రమం చేపట్టిన వీరాచారవంతుల్లో ఒకరు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. వీరాచారవంతులు 22 మంది పట్టణంలో కొణతముల ఊరేగింపు అనంతరం నాగులేటిలోని గంగధార మడుగులో కొణతములను శుద్ధి చేసేందుకు దిగారు. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లైన్ వైరు ప్రమాదవశాత్తూ తెగి గంగధారమడుగులో పడింది. విద్యుత్ షాక్‌కు గురైన.. చిలకలూరిపేటకు చెందిన జాలయ్య (38) మృతిచెందగా.. పుల్లలచెరువు మండలం నీలగంగారం గ్రామానికి చెందిన అంకమ్మరావు గాయపడ్డారు. ఇది గమనించిన మరో వ్యక్తి హుటాహుటిన ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు తొలగించడంతో పెనుప్రమాదం తప్పింది. లేకపోతే.. ఊహకందని ప్రాణనష్టం జరిగి ఉండేది. గాయపడిన అంకమ్మరావును 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. గురజాల డీఎస్పీ జగదీష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా బందోబస్తు చేపట్టారు.

4 పళ్ల విభాగంలో విజేత ప్రకాశం జిల్లా ఎడ్లు

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు ఆదివారం ఉత్సాహం సాగాయి. 4 పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పోట్లపాడుకు చెందిన మేడగం హర్షవర్ధన్‌రెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయంలో బండను 4,521 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. తెలంగాణలోని మేళ్ల చెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలీక్‌రెడ్డి ఎడ్ల జత 4,117 అడుగులతో రెండో స్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరానికి చెందిన కడియం మణికంఠ ఎడ్ల జత 4,113 అడుగులతో మూడోస్థానం, నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన మనోజ్ చౌదరి ఎడ్లజత 4,053 అడుగులతో నాలుగో స్థానం, హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత 3,232 అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లికు చెందిన హర్షవర్ధన్ ప్రభాకర్, పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన బొమ్మిన శివమణినాయుడు సంయుక్త ఎడ్లజత 2,610 అడుగులతో ఆరోస్థానం, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కొరగల్లుకు చెందిన దారం శ్రీలత ఎడ్లజత 2,151 అడుగులతో ఏడోస్థానంలో నిలిచాయి. కాపు సంఘ నేత సంగినేని బాలకృష్ణ బహుమతులను ప్రదానం చేశారు. సొసైటీ చైర్మన్ నాగారపు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శేషగిరిరావు, జక్కా నరసింహారావు, అమరయ్య, మాజీ ఎంపీపీ నాగుల్ నాయక్, పలిశెట్టి కొండ, తోట శ్రీను పాల్గొన్నారు.


బండ లాగుతున్న ప్రకాశం జిల్లా ఎడ్లు

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం ఆదివారం నాటికి 583.70 అడుగులు ఉంది. ఇది 293.70 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500 , ఎడమ కాలువ ద్వారా 4034 , ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 15634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 15,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.25 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి ఎనిమిది వందల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 3,600, లీకుల ద్వారా 400, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

దైద అమరలింగేశ్వరస్వామిని దర్శించుకున్న జడ్జిలు

గురజాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో వేంచేసియున్న శ్రీఅమరలింగేశ్వరస్వామిని ఆదివారం గురజాల కోర్టు పదో అదనపు జడ్జి ప్రియదర్శిని, సబ్ జడ్జి వై.శ్రీనివాసరావు, సివిల్ జూనియర్ జడ్జి సత్యనారాయణలు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కండక్టర్ల సస్పెన్షన్‌ల రగడ

● మగ వారికి ఉచిత టిక్కెట్ల జారీపై చర్యలు
● ఇప్పటికే 8 మందిపై వేటు
● 2019 సర్క్యులర్‌కు విరుద్ధమని ఉద్యోగ సంఘాల ఆందోళన

గుంటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల డిపోల్లో కండక్టర్‌ల వరుస సస్పెన్షన్‌లతో జిల్లాలోని ఆర్టీసీలో రగడ నెలకొంటోంది. స్త్రీ శక్తి పథకంతో రద్దీ నేపథ్యంలో మగ వారికీ జీరో టిక్కెట్లు జారీ చేయడంతో కండక్టర్లపై వరుసగా సస్పెన్షన్‌ల వేటు పడుతోంది. దీనిపై ఆర్టీసీలోని పలు ఉద్యోగ సంఘాల నాయకులు భగ్గు మంటున్నారు. ఇటువంటి వ్యవహారాల్లో పల్నాడు, బాపట్లతో పాటు ఇతర జిల్లాల్లో లేని సస్పెన్షన్‌లు ఇక్కడ అమలు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కొన్ని రోజులుగా నిరసనలు తెలిపిన సంఘాల నాయకులు.. డీపీటీవోకు విజ్ఞాపనపత్రాలు కూడా అందజేశారు. త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఇటీవల ప్రకటించడంతో.. డిపో మేనేజర్లు వర్సెస్ ఉద్యోగ సంఘాల నాయకులుగా పరిస్థితి మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో.. పల్లె వెలుగు సర్వీసుల్లో మగవారు 20శాతం ఉంటే మహిళా ప్రయాణికులు 80శాతం ఉంటున్నారు. మహిళలకు జీరో టికెట్లు ఇచ్చే క్రమంలో మగ వారికి కూడా పొరపాటున కండక్టర్లు ఇచ్చేస్తున్నారు. టీటీఐ తనిఖీల్లో వీటిని పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు.

డిపోల్లో వరుస సస్పెన్షన్‌లు

ఇలా మగ ప్రయాణికులకు ఉచిత టిక్కెట్లు ఇవ్వడంతో.. గుంటూరు-1 డిపోలో ఇద్దరిని, తెనాలి డిపోలో ఇద్దరిని, అత్యధికంగా గుంటూరు-2 డిపోలో నలుగురు కండక్టర్లను సస్పెండ్ చేస్తూ డిపో మేనేజర్లు ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో కండక్టర్లు పొరపాటుగా వ్యవహరించినా సస్పెన్షన్ చేయడంపై.. ఉద్యోగ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇది 1/2019 సర్క్యులర్ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కండక్టర్లు కావాలని ఉచిత టికెట్లు మగవారికి ఇవ్వరని చెబుతున్నారు. అధికారులు నిబంధనలు పాటించాలని, విరుద్ధంగా వ్యవహరిస్తే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

గుర్తింపు కార్డులివ్వాల్సిందే

ఆర్టీసీలో ఉచిత ప్రయాణంపై మహిళలకు గుర్తింపు కార్డులిస్తే సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇటీవల మంగళగిరి డిపో పరిధిలో ఓ మహిళకు ఉచిత ప్రయాణ టికెట్ ఇవ్వడంపై టీటీఐ తనిఖీల్లో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఆధార్ కార్డు బయటపడింది. ఇలా అనేక పొరపాట్లు దొర్లుతున్నాయని, భవిష్యత్తులోనూ ఇబ్బందుల్లేకుండా గుర్తింపు కార్డులు జారీ చేస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో సంతోషంగా ప్రజలు

పిడుగురాళ్ల నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని, రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఆదివారం రాత్రి పిడుగురాళ్లలో తన నివాసానికి వర్ల రామయ్య ఆహ్వానించగా.. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెళ్లారు. ఈ సందర్భంగా వారిద్దరూ రాష్ట్రంలో అభివృద్ధి పథకాలు, ఇంటింటికి ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, కూటమి ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయంపై తదితర అంశాలపై చర్చించుకున్నారు.

బీసీలకు 52శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

● ఏఐ బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.పరంజ్యోతి

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ(ఏఐ బీఎస్పీ)రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి. పరంజ్యోతి పేర్కొన్నారు. పాతగుంటూరు, నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం ఏఐబీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు తగు ప్రాధాన్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే 52శాతం కల్పించేలా చట్టాలను మార్పు చేయాలన్నారు. బీసీ కులాల జేఏసీ నాయకుడు ఎల్ వెంకటేశ్వర్లు, బీసీ మహాజన సభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి లక్ష్మి, నారాయణ, ప్రకాష్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 50 వేలు

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. నాగసిరి, శాంతిసిరి, అగస్త్య లాంచీలలో కొండకు చేరుకున్నారు. కొండపైన మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు సందర్శించారు. అనంతరం అనుపు, ఎత్తిపోతలను పర్యాటకులు వీక్షించారు. లాంచీల ద్వారా రూ.50 వేల ఆదాయం వచ్చిందని లాంచీ యూనిట్ మేనేజర్ మస్తాన్‌బాబు తెలిపారు.


నాగార్జున కొండను సందర్శించిన పర్యాటకులు

బాపట్ల తీరంలో..

బాపట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్రతీరంలో ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. పంజాబ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు సూర్యలంక తీరానికి చేరుకుని సేదతీరారు. ఇక్కడ వాతావరణం కనుల విందుగా ఉందని.. ఏర్పాట్లు బాగున్నాయని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.


సూర్యలంక తీరంలో పర్యాటకులు

పల్నాడు వార్తలు

నేడు వైకుంఠపురంలో ప్రజల వద్దకు ప్రవీణ్

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రాష్ట్రంలో తొలిసారిగా నియోజకవర్గంలో వందరోజులు వంద గ్రామాల పర్యటన పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం మండల పరిధిలోని వైకుంఠపురంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పర్యటించి పాఠశాలల సందర్శన, గ్రామస్థుల సమస్యలు తెలుసుకోవడం, పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేస్తారన్నారు. దీనిపై అధికారులు కూడా వారివారి శాఖలకు సంబంధించి పథకాల అమలు, పెండింగ్ సమస్యలపై రిపోర్టును సిద్ధం చేస్తున్నారు. ఏ గ్రామంలో పర్యటిస్తే అదే గ్రామానికి చెందిన నాయకులు మాత్రమే ఎమ్మెల్యే వెంట ఉండేలా నిర్ణయం తీసుకున్నారు.

నేడు రైతన్న మీకోసం ప్రారంభం

వెల్దుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండంలోని శిరిగిరిపాడులో సోమవారం రైతన్న మీ కోసం కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరపరా నిలిపివేత

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అమరావతి సబ్‌స్టేషన్‌లో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్నందున ఉదయం 7 నుంచి సాయంత్రం 7గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ పి.రవికిరణ్ తెలిపారు.

మహేంద్ర మేదర సంఘ కార్యవర్గ ఎన్నిక

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మహేంద్ర మేదర సంఘ కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి మేదర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జె.మస్తాన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యవర్గాన్ని నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా అమరావతికి చెందిన జొరిగె శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్ లక్ష్మీనారాయణ, సహాయ ప్రచార కార్యదర్శిగా పి.హనుమంతు, జిల్లా యువత అధ్యక్షుడిగా తిరుమల శ్రీనివాసరావు, జిల్లా మహిళా గౌరవ అధ్యక్షురాలిగా టి.అరుణకుమారిని ఎన్నుకున్నారు. మేదర సంఘ సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని అధ్యక్ష కార్యదర్శులు తెలియజేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మండాది శివారులో ఆదివారం రాత్రి జరిగింది. తూర్పు గోదావరి జిల్లా మండపేటకు చెందిన శివాజీ, సుమన్‌లు కొన్ని రోజులుగా మండలంలోని ఇంటి నెంబర్ల ప్లేట్లు బిగించేందుకు వెల్దుర్తి మండలానికి వచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని పట్లవీడులో ఇంటి నెంబర్ల ప్లేట్లు బిగించి తిరిగి మాచర్ల పట్టణానికి బయలుదేరారు. మండాది శివారులోకి రాగానే మండాది వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం, వీరి ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన కళ్యాణం శివ శ్రీనివాసరావును జనసేన సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని అప్పారావు అన్నారు. అందుకు శివ శ్రీనివాసరావు నిదర్శనమన్నారు. **(సత్తెనపల్లి)**

4 వేల మందికి అన్న ప్రసాదం

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా నిర్వహిస్తున్న వీరారాధన ఉత్సవాలకు వచ్చిన వీరాచారవంతులు, భక్తులు, ప్రజలు సుమారు 4 వేల మందికి శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటి ఆధ్వర్యాన అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, వాసవీ దేవస్థాన అధ్యక్షుడు మద్దు హనుమంతురావు, నాగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ యక్కల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, యువజన సంఘ అధ్యక్షుడు సముద్రాల సాయి, వాసవీ జాగృతి అధ్యక్షుడు కరాలపాటి నారాయణ, గుండాల మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అష్టోత్తర భస్మావళి

పిడుగురాళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక నాగుల గుడిలో శ్రీ సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 300 మంది భక్తులు కావడి ఉత్సవంలో పాల్గొన్నారు. నాగులగూడెం నుంచి గంగమ్మ తల్లి దేవాలయం వరకు ప్రధాన వీధుల్లో కావడి ఉత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర నామ కార్యక్రమాల్లో దేవాలయ అధ్యక్షుడు జి నాగ సతీష్, అర్చకుడు గుంటుపల్లి వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం మాచవరం మండలం వెల్లంపల్లికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో ఇరువురుకి గాయాలు కావడంతో అటుగా వెళ్తున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రమాదాన్ని గమనించి తన కాన్వాయిని నిలిపి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ఎక్కించి ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టి మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యులకు ఫోన్ చేసి మాట్లాడారు. తక్షణ సాయం కింద క్షతగాత్రులకు రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు.



బాధితులను పరామర్శించి అంబులెన్స్‌లోకి చేర్పుతున్న యరపతినేని

సత్యసాయి జయంతి వేడుకల్లో ..

పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులో గల భగవాన్ సత్యసాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యాన నిర్వహించిన సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే యరపతినేని పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయనను సేవా సమితి నిర్వాహకుడు కొత్తా వెంకటసుబ్బారావు, కమిటీ సభ్యులు సన్మానించారు.

ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యంతో సమావేశం

దాచేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి నగర పంచాయతీలోని శ్రీనిధి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం జనరల్ బాడీ సమావేశానికి ఎమ్మెల్యే యరపతినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని బస్సులను అనుమతి ఇవ్వటానికి అధికారులు అంగీకరించరని తెలిపారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను చూసి యరపతినేని వారిని అభినందించారు. సభలో టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి కూడా హాజరయ్యారు. గురజాల నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం హాజరయ్యారు.

మానవసేవే మాధవ సేవ

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మాచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవ సేవ అని భావించి శ్రీసత్యసాయి ట్రస్ట్ సేవలను ప్రపంచం మొత్తం కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సొసైటీ కాలనీలో గల శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో నిర్వహించిన సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేదికపై ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతపురం మారుమూలలో జన్మించి బాల్యం నుంచి ఆధ్యాత్మిక చింతనతో భగవాన్ సత్యసాయి జీవితాన్ని సాగించి ఎన్నో లక్షల పేద కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రతి విద్యార్థి విద్యనభ్యసించి ఉన్నతంగా ఎదిగి పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

● దుర్గి మండలం ఆత్మకూరు గ్రామ సీనియర్ నేత బ్యంగా లింగయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు

● అమరేశ్వరాలయ ధర్మకర్తల మండలి

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అమరేశ్వరస్వామి ఆలయం సందర్శించే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఆదివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరిగింది. మండలి చైర్మన్ వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు సభ్యులు స్నానఘాట్‌ల వద్ద శుభ్రత పాటించాలని, అన్నదాన కార్యక్రమానికి సంబధించిన డిపాజిట్‌ల వివరాలు తెలియజేయాలని, ధర్మకర్తల మండలి సభ్యులకు సిబ్బంది తగిన గౌరవం ఇవ్వాలని, సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. చైర్మన్ మాట్లాడుతూ స్నాన ఘాట్‌లను పెంచాలని, గత ఈవో ప్రతిపాదించిన రెండు అర్చక పోస్టులను రద్దు చేస్తూ తీర్మానం చేయనున్నట్లు సభ్యులకు తెలియజేశారు. ధర్మకర్తల మండలి సూచనల మేరకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఈవో రేఖ తెలిపారు. సమావేశంలో మండలి సభ్యులు పాల్గొన్నారు.



చైర్మన్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం

చెకుముకి సైన్స్ పోటీల్లో బాలికోన్నత పాఠశాల ప్రథమం



బహుమతులు అందిస్తున్న లక్ష్మణరావు

మాచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం చిలకలూరిపేటలోని సాదినేని చౌదరయ్య కళాశాలలో ఆదివారం చెకుముకి సైన్స్ సంబరాలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులు అందించారు. విద్యార్థినులకు హెచ్‌ఎం ఉషారాణి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కెవి రమణ, కార్యదర్శి చలపతిరావు, ఉపాధ్యక్షుడు జేవీఎస్ ప్రసాద్, సమతా విభాగం అధ్యక్షురాలు ఆయేషా, మహ్మద్ రఫీ, బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సమస్యలు పరిష్కరించాలని ఈవోకు వినతి

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అమరేశ్వరాలయంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు చిరుమామిళ్ల గోపీకృష్ణ, చెట్టి నిరంజనరావు, మండల నాయకులు ఎం వెంకటేశ్వరరావులు దేవస్థాన ఈవో రేఖకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణా రాష్ట్రంలోని దెందుకూరులో దేవస్థాన భూముల కౌలు పెంచేలా నిర్ణయం తీసుకోవాలని, ఆలయ పరిసరాల్లో మత మార్పిడులను నిషేధించాలని, స్నానఘాట్‌లకు దూరంగా పిండ ప్రధాన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, అన్యమతస్థులను ఆహ్వానించరాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని ఈవో హామీ ఇచ్చారు.



ఈవో రేఖకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలు స్థానిక శ్రీసత్యసాయి ప్రేమ మందిరంలో ఆలయ ధర్మకర్తలు శ్రీహరి ప్రసాద్, కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యాన ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు హనుమంతుచార్యులు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారిని పల్లకిలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటి ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ రామకృష్ణ, ప్రసాద్, జానారెడ్డి, గొంతిన సాయిరాం, రాజేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విజయపురిసౌత్‌లో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు

● రెంటచింతల: రెంటచింతలలోని పర్తిసాయి ఆలయంలో బాబా జయంతి వేడుకలను నిర్వహించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త నాళం నరశింహారావు,కె.కోటేశ్వరరావు, నాళం సోదరులు, నరశింహారావు, తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం: మండలంలోని పిల్లుట్లలో ఆదివారం పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ, బాహటం సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.

● అచ్చంపేట: అచ్చంపేట సత్యసాయి సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున నగర సంకీర్తన జరిగింది. అనంతరం ఆలయంలో బాబాకి పంచామృతాలతో అభిషేకాలు, తపోవన పారాయణం నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు భక్తులతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే వంద గ్రామాల పర్యటన

బెల్లంకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికే నియోజకవర్గంలోని వంద గ్రామాల పర్యటన కార్యక్రమం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్య క్షుడు అక్కల వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల వంద గ్రామాల కార్యక్రమం గురించి టీడీపీ నాయకులు వివరించారు. మండలంలో ఏ గ్రామానికైనా ఎమ్మెల్యే రావచ్చని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.

వెంకటేశ్వరరాజుకు ఘన సన్మానం

సత్తెనపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సరికొండ వెంకటేశ్వరరాజును ఆదివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజులు సన్మానించి అభినందించారు. చైర్మన్‌గా నియమితులైన వెంకటేశ్వరరాజు మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను, కన్నా నాగరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో భట్రాజు సంఘ అభివృద్ధికి, టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తానని వెంకటేశ్వర రాజు తెలిపారు. అనంతరం టీడీపీ నేత మన్నెం శివ నాగమల్లేశ్వరరావును కూడా వెంకటేశ్వరరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శివనాగమల్లేశ్వరరావు, తెలుగుయువత నాయకులు వక్కంటి అజయ్‌కుమార్, పోట్ల ఆంజనేయులు తదితరులు ఘనంగా సన్మానించారు.



సరికొండ వెంకటేశ్వరరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కన్నా నాగరాజు

ముగిసిన మండలస్థాయి క్రికెట్ పోటీలు



బహుమతులతో క్రీడాకారులు

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధ ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫ్రెండ్ సర్కిల్ సీసీ సినిమా హాల్ సెంటర్ జట్టు ప్రథమస్థానంలో నిలువగా రూ.20 వేలను జంగా నరేంద్ర అందించారు. అలాగే బ్రహ్మనాయుడు సీసీ కారంపూడి జట్టు రెండోస్థానంలో నిలవగా రూ.15 వేలను కోనేటి వెంకటేష్, నరేంద్ర సీసీ కారంపూడి జట్టు మూడోస్థానంలో నిలవగా రూ.10 వేలను బొమ్మిన నరేంద్ర, కారంపూడి సీసీ జట్టు నాలుగోస్థానంలో నిలవగా రూ.7500లను గ్రంధి కౌశిక్ అందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైవీ ఆంజనేయులు, జాజిబాబు దంపతులు

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) పుట్టపర్తి సత్యసాయి బాబా శతజయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీషిర్డీసాయి పర్తిసాయి కపోతేశ్వర ధ్యానమందిరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం షిర్డీసాయిబాబా విగ్రహానికి సామూహిక స్నానం, హనుమాన్ చాలీసా పారాయణం, పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. సత్యసాయి సేవాసమితి అధ్యక్షుడు చేకూరి జాజిబాబు దంపతులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేసే కార్యక్రమంలో సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని పేదలకు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జీరో శాతం రక్షణతో ఉత్పాదక చర్యలు

దాచేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా సిమెంట్ ఫ్యాక్టరీలో ఆదివారం 40వ మైన్స్ సేఫ్టీ వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ కే వేణుగోపాల స్వామి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ కే జ్ఞానేశ్వర్, సాగర్ సిమెంట్స్ లిమిటెడ్ గ్రూపు ప్రెసిడెంట్ కే గణేష్, సెక్రటరీ నవీన్ కుమార్‌రెడ్డి, చైర్మన్ సీహెచ్ సుబ్బారావులు హాజరయ్యారు. ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మికుల భద్రతకే ప్రాధాన్యం ఇస్తూ ఉత్పత్తిని కొనసాగించటం సంతోషకరమన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి ఫ్యాక్టరీలో మైనింగ్‌లో తీసుకుంటున్న భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.

ఆర్‌సీఎం చర్చిలో ఘనంగా క్రీస్తు రాజు పండుగ



చెరుకుంపాలెం ఆర్‌సీఎం చర్చిలో దివ్య బలిపూజ నిర్వహి స్తున్న ఫాదర్ తుమ్మా మర్రెడ్డి, రాజారెడ్డి

అచ్చంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరుకుపాలెంలోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం క్రీస్తు రాజు పండుగ ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు తాళ్ళచెరువు విచారణ గురువు తుమ్మా మర్రెడ్డి ఆయనతో పాటు అనేక మంది గురువులు దివ్య బలిపూజ నిర్వహించారు. వందలాది మంది క్రైస్తవులు, భక్తులు పూజలో పాల్గొన్నారు. సిస్టర్ తుమ్మా రుషీనా గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులు క్రీస్తు రాజు చర్చికి వెండి కిరీటాన్ని బహూకరించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆర్‌సీఎం చర్చిలో కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. అనంతరం గ్రామ వీధుల్లో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఫాదర్ రాజారెడ్డి, తాళ్ళచెరువు విచారణ సహాయక గురునాథం బందనాథం మరియ కుమార్, అడ్డగట్ల శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వారు సేవా భావాన్ని కలిగి ఉండాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, రమేష్

పెదకూరపాడు, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): ప్రతి వారు సేవా భావాన్ని కలిగి ఉండాలని, అవకాశం ఉన్నంతలో పేదవారికి సహాయపడాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్తిమళ్ళ రమేష్ జన్మదినం సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లను జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ గుత్తా కవితా రాము సమకూర్చిన నాలుగు చక్రాల బండ్లను చిరువ్యాపారులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ టీడీపీ సందర్భంగా మండల నాయ కులు మేదరమెట్ల సౌమిత్ చౌదరి మిత్ర మండలి ఏర్పాటు చేసిన 60 కేజీల కేక్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ కట్ చేసి రమేష్‌కు పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొని రమేష్‌కు బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివాలయంలోని అయ్యప్ప స్వాములకు సద్ది ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని పాటిబండ్లలో కారుణ్య వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, ఎంఎస్‌ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గుడిపూడి చినరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మక్కెన సాగర్, సర్పంచ్ గుడిపూడి రాజు, వట్టికూటి శివరామ కృష్ణయ్య, అంద్ర ప్రసాదు, షేక్ అబ్దుల్లా, టీడీపీ జిల్లా నేతలు భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, నెల్లూరి మల్లికార్జున్, గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకురాలు నాగమ్మ గుడిని అభివృద్ధి చేస్తాం

● టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాయకురాలు నాగమ్మ గుడిని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి వివరించారు. ఆదివారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులో నాయకురాలు నాగమ్మ నిర్మించిన శ్రీచెన్న మల్లికార్జున స్వామి వారి దేవాలయం వద్ద ముఖ మండపం నిర్మాణానికి శ్లాబు వేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై అభివృద్ధి పనులు ప్రారంభించారు. గామాలపాడు గ్రామానికి చెందిన చిట్టిప్రోలు ప్రసాదరావు కుమారులు సూర్యం, భవానీ ఐరన్ స్టోర్ సహకారంతో ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్టు వివరించారు. ఈ దేవాలయం వద్ద వేద పాఠశాల, గోశాల, వృద్ధాశ్రమం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

దాచేపల్లిలోని అపూర్వ స్వాగతం మరచిపోలేనిది

● సినీ నటుడు ఆలీ



ముస్లిం మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తున్న సినీ నటుడు ఆలీ

దాచేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో ముస్లింలు, అభిమానులు చూపిన ఆదరణ ఎప్పటికీ మరచిపోలేనిదని ప్రముఖ సినీ నటుడు ఆలీ అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ నూర్ మజిద్ ప్రాంగణంలో ఆల్‌నూర్ ఫౌండేషన్, లాల్‌యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం మహిళలకు కుటుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలీ పాల్గొన్నారు. ఆంధ్రా సరిహద్దులోని పొందుగుల నుంచి అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ నా తండ్రి టైలర్‌గా పని చేశారని గుర్తు చేసుకున్నారు. మహిళలకు కుట్టుమిషన్‌లలో శిక్షణ ఇవ్వటం, మిషన్లను ఉచితంగా పంపిణీ చేయటం మంచి సంప్రదాయమన్నారు. ముస్లింల అభ్యున్నతికి సహకరిస్తానని భరోసాను ఇచ్చారు. అనంతరం ముస్లింలు ఆలీకి శాలువాలు కప్పి సన్మానం చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా షేక్ మున్వర్ బాజీ



మున్వర్ బాజీకి నియామకపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కామినేని

నకరికల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడిగా షేక్ మున్వర్ బాజీకి ఆదివారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కామినేని హనుమంతరావు నకరికల్లులో నియామకపత్రాన్ని అందజేశారు. మండలంలో బీజేపీ పటిష్టతకు ప్రధానిమోదీ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బాజీకి హనుమంతరావు సూచించారు. తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ జిల్లా నాయకులకు బాజీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జొన్నా భట్ల ఆదిత్య, అనుమోలు శ్రీనివాసరావు, రావుట్ల సాంబాచారి, కే మోహన్, వీరాంజనేయులు, నాగరాజు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

సాగరమాత ఆలయంలో భక్తుల ప్రత్యేక ప్రార్థనలు



తేరు ప్రదక్షిణలో భక్తులు

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్ ఆధ్వర్యాన దివ్యబలిపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా ఆలయానికి తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోకుంటే చర్యలు : ఎస్ఐ

నకరికల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గతంలో రౌడీషీటర్లుగా ఉన్నా ప్రస్తుతం పద్ధతి మార్చుకొని మంచి నడవడికతో ఉండాలని, ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా, వివాదాల్లో తలదూర్చకుండా వ్యవహరించాలని నకరికల్లు ఎస్ఐ కే సతీష్ రౌడీ షీటర్లకు సూచించారు. పోలీసు రికార్డుల్లో రౌడీ షీటర్లుగా నమోదై ఉన్న వారిని ఆదివారం నకరికల్లు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరు తమ జీవనాన్ని కొనసాగించాలని, ఇందుకు బిన్నంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వారందరితో సంతకాలు, పూచీకత్తులు తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపి వేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

యడ్లపాడు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ కృష్ణారావు

యడ్లపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ, గుంటూరు ఇన్‌చార్జి ఎస్పీ బి కృష్ణారావు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. సాధారణ తనిఖీలలో భాగంగా శనివారం సాయంత్రం గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతూ యడ్లపాడు స్టేషన్‌కు వచ్చారు. ముందుగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల విషయంలో దృష్టి పెట్టాలని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలో శాంతి భద్రతల పరిస్థితిపై సమీక్షించారు. ఇటీవల నమోదైన కేసుల పూర్వాపరాలను పరిశీలించారు. కార్యక్రమంలో రూరల్‌సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

చిలకలూరిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సంబరాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని సాదినేని చౌదరయ్య రెసిడెన్షియల్ పాఠశాలలో పల్నాడు జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ఘనంగా జరిగాయి. వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్.లక్ష్మణ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు, సైన్స్‌పై ఆసక్తి కలిగించేందుకు ఈ సంబరాలు దోహదపడతాయన్నారు. జిల్లాల్లోని వివిధ మండలాలకు చెందిన 25 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల టీములు పాల్గొన్నాయి. టీముకు ముగ్గురు విద్యార్థుల వంతున 75మంది విద్యార్థులు 50మంది ఉపాధ్యాయులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం వినుకొండ గీతం పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం మాచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు కైవసం చేసుకుని కాకినాడలో ఈ డిసెంబరు 21, 22, 23 తేదీలలో జరిగే రాష్ట్ర సంబరాలకు ఎంపికయ్యారు. కాగా ప్రైవేటు పాఠశాలల విభాగంలో చిలకలూరిపేట చైతన్య లిటిల్స్ స్కూలు విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.చలపతిరావు పాల్గొన్నారు.

ఎనిమిది బ్యాటరీలు చోరీ

యడ్లపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు చెందిన బ్యాటరీలు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇంటిముందు నిలిపి ఉంచిన ఆటోల నుంచి బ్యాటరీలు చోరీ జరిగాయంటూ యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోయపాలెం, జగ్గాపురం, యడ్లపాడు గ్రామాల పరిధిలో ఈ నెల 21వ తేదీరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోల నుంచి బ్యాటరీలను దొంగిలించారన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులో 6, జగ్గాపురం, బోయపాలెంలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 బ్యాటరీలు చోరీకి గురయ్యాయన్నారు. చోరీకి గురైన బ్యాటరీల విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తెలిపారు. చోరీ విషయమై శనివారం సాయంత్రం వాహనదారులు పోపూరి వంశీ, గొట్టిపాటి రామారావు, యల్లమంద కృష్ణ, బండ్ల రామ్ కుమార్, బండ్ల కొండలు, మేకల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, షేక్ షబ్బర్‌ల యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ వెల్లడించారు.

రెండో పట్టణ ఎస్ఐగా సౌందర్ రాజన్

నరసరావుపేట లీగల్, నవంబర్ 23, (ఆంధ్రజ్యోతి), నరసరావుపేట రెండో పట్టణ ఎస్ఐగా సౌందర్ రాజన్ ఆదివారం ఉదయం బాధ్యతల స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన సత్తెనపల్లి రూరల్ ఎస్ఐగా సేవలందించారు. సౌందర్యరాజా నియామకంతో ప్రస్తుతం నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో నలుగురు ఎస్ఐలు ఉన్నారు.

ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు

ఈపూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 సంవత్సరాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్పీ ఆవులయ్య తెలిపారు. 18 పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబరు 17వ తేదీ వరకు గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 18వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదిక ఉంటుందన్నారు.

బీజేపీ నరసరావుపేట పట్టణ, మండలం అధ్యక్షుల నియామకం

నరసరావుపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశి కుమార్ అధ్యక్షతన ఆదివారం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. నరసరావుపేట 1వ పట్టణానికి గుండా రాజేష్ కుమార్, నరసరావుపేట రూరల్ మండలానికి అధ్యక్షుడిగా పొందుగల వెంకటేశ్వర్లును నియమించారు. ఈ సందర్భంగా నియమాక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు వల్లెపు కృపారావు, ఉపాధ్యక్షుడు ఇత్తడి కిరణ్, కామినేని హనుమంతరావు, జన్నాభట్ల ఆదిత్య, తవ్వా మల్లికార్జునరావు, కొత్తమాసు వెంకటప్పయ్య, దాయిందే కిషోర్, ఆలపాటి త్రినాథరావు, దినకర్, చిరంజీవి, పెండ్యాల బాలాజీ, కూనిశెట్టి సాయినాథ్, సాధు మహేష్, చీమకుర్తి రాజా, గురుబ్రహ్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న నాగవాణి



వృద్ధునికి చికిత్సచేస్తున్న చందోలు నాగవాణి

వినుకొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వ్యక్తికి ప్రథమ చికిత్సను అనంతరం వైద్యశాలకు తరలించిన సంఘటన పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలను పరిశీలిస్తే... పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన నలుగురు విద్యార్థులు పట్టణంలోని అబ్దుల్ కలాం తెరిసా సేవా సొసైటీ ఫౌండర్ చందోలు నాగవాణికి సమాచారం అందించారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న నాగవాణి ఆయన పూర్వపరాలు తెలుసుకొని బోసుబొమ్మ సెంటర్‌కు చెందిన కూకట్ల వెంకటేశ్వర్లుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించి ప్రథమ చికిత్స అందించి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో బంధువులు నాగవాణికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి



నరసరావుపేట మునిసిపాలిటీలో సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

చిలకలూరిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతిని చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించడం ఆ మహనీయునికి అందించిన చిరు గౌరవం అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. ప్రేమ, కరుణతో నిండిన సామాజిక సేవతో ప్రజల హృదయాల్లో గొప్పస్థానం సంపాదించిన ఆధ్యాత్మిక రూపంగా సత్యసాయి నిలిచారని వివరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సత్యసాయిబాబా శతజయంతి వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● నాదెండ్ల: గణపవరంలోని శాంతినగర్‌లో షిరిడీ సత్యసాయి దేవాలయంలో సత్యసాయి శత జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవతామూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కమిటీ అధ్యక్షుడు చంద్రయ్య తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



వెల్లటూరులో సత్య సాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

● నరసరావుపేట రూరల్: మండలంలో, పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివారం సత్యసాయి బాబా 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా 100వ జయంతిని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సూచనల మేరకు నరసరావుపేట మునిసిపాలిటీ, మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివారం శ్రీసత్యసాయి బాబా చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా సేవా ట్రస్టు ద్వారా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవలను ప్రజలకు అవగాహన కలిగించారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరులో సత్య సాయి శత దినోత్సవ జన్మదిన వేడుకలను పేరం వేణు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సత్య సాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. పేరం వేణు, సుజాత దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కె.లక్ష్మీనారాయణ, ఎ.నరసింహారావు, కోట సుబ్బారావు, జి.రామారావు, మండవ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్



లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికులు దశాబ్దాల పాటు వీరోచిత పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను అమలుచేసి చీకటి చట్టాలను రద్దు చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా వినుకొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మికుల మస్టర్ సమయంలో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల చట్టాలను కాలరాసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఎత్తివేస్తున్నారన్నారు. దీనిని సభ్య సమాజం ప్రజలు రైతులు కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకించి పోరాటం చేసి ప్రభుత్వాన్ని నిలువరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కే.మల్లికార్జునరావు, కార్మిక నాయకులు ఎస్.అబ్రహంరాజు, రాచపూడి ఏసుపాదం, కంచర్ల కోటేశ్వరరావు, కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ సభ్యులు

నరసరావుపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని విజయ కుమార్ లక్ష్మీదేవి కల్యాణ మండపంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ 21వ వార్షికోత్సవం జరిగింది. వార్షికోత్సవ జిల్లా సమావేశానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంటు ఎరుకుల రామక్రిష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎరుకుల రామక్రిష్ణ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అంతర్జాతీయంగా 35 దేశాలలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసవి క్లబ్ ద్వారా విద్యార్థుల కోసం నూతన గ్రంథాలయాలు ఏర్పాటు, పలు పట్టణాలలో కల్యాణ మండపాల నిర్మాణ వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం విద్య, వైద్యం, వ్యాపారం కొరకు వడ్డీలేని రుణం అందిస్తున్నామన్నారు. స్వయం ఉపాధి పథకం ద్వారా ఒకొక్కరికి రూ.లక్షరూపాయల వరకు వడ్డీలేని రుణం అందించడం జరుగుతుందన్నారు. ఆర్యవైశ్యుల పిల్లలు ఎవరైనా ఐఎఎస్, ఐపిఎస్ వంటి గ్రూప్-1,గ్రూ-2 వంటి చదువులకు అవసరమైన ఆర్థిక సహాయం రూ కోటి రూపాయల వరకు అందించడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లా గవర్నర్‌గా సంవత్సరం పాటు ఉత్తమ సేవలందించిన మునగాల చిరంజీవి రాధిక దంపతులను వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఎరుకుల రామక్రిష్ణ అభినందించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంటు ముక్కా శ్రీనివాస్, కొత్తమాసు సుజాత లక్ష్మీ, కొత్తమాసు కాశి విశ్వనాథ రావు, అనుమలశెట్టి వెంకట సీతారామయ్య, కొలిశెట్టి శివ సుబ్రమణ్యం, దోగిపర్తి సుజాత, పోతుగంటి వెంకట శివరామక్రిష్ణ, వెల్లంపల్లి కేశవరావు, బొగ్గవరపు బాల పావని, కొత్తా వెంకట పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓబీసీ వర్గీకరణ చేపట్టాలి

● రాష్ట్ర సంచార జాతుల అభివృద్ధి మండలి అధ్యక్షుడుశ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓబీసీ వర్గీకరణ చేపట్టాలని రాష్ట్ర సంచార జాతుల అభివృద్ధి మండలి అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నరసరావుపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం దాసరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మామిడాల గిరిబాబును రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసిన నేపథ్యంలో గిరిబాబు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్వామిజీ చెన్నూరి ఏడుకొండలు, అరబోలు వెంకటాద్రి, నాయని కోటేశ్వరరావు, అరబోలు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు భగవద్గీత పోటీలు



విజేతలతో నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శృంగేరి శంకర మఠంలో విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో బి.ఆకాంక్ష (హిందూ హైస్కూల్, నరసరావుపేట) ప్రథమ, ద్వితీయ స్థానం ఎం.త్రిపుర (హిలేరియమ్ స్కూల్, చిలకలూరిపేట), తృతీయ స్థానం పి.వైష్ణవి (రెయిన్ బో స్కూల్) సాధించారు. భగవద్గీత భావ విశ్లేషణలో ప్రథమ ఏజీ వైష్ణవి (నరసరావుపేట), ద్వితీయ ఎం.నాగమణి (పెదకూరపాడు), తృతీయ పి.శశిరేఖ (కారంపూడి) దక్కించుకున్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందించామని నిర్వాహకులు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా నోరి కోదండరాం, పీవీఎస్ఆర్ ప్రసాదరావు, రత్నాకరం రాము, కే.నాగరాజుశర్మ, సురేష్, కే.అమరేశ్వరరావులు వ్యవహరించారన్నారు. కాగా కార్యక్రమం టీటీడీ ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త ఇ.అమ్మడు పర్యవేక్షణలో నిర్వహించినట్లు చెప్పారు.

ఘనంగా ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలెడిక్టరీ

నరసరావుపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసానుపల్లిలో ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం విజయవంతంగా ముగిసిన సందర్భంగా వాలెడిక్టరీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ దివ్యతేజమూర్తి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత ప్రాధాన్యం కలిగిఉందన్నారు. ఎన్ఎస్ఎస్ వంటి సేవా కార్యక్రమాలు విద్యార్థులలో బాధ్యతాభావాన్ని పెంపొందిస్తాయన్నారు. వ్యసన నిర్మూలన, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఏఎం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాజినిలు హాజరయ్యారు. మొత్తం 50 మంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీలు, శుభ్రత అవగాహన సమావేశాలు, ఆరోగ్య సంబంధిత సందేశాలు అందిస్తూ శిబిరాన్ని విజయవంతం చేశారు.

కొండ్రముట్లలో దొంగల హల్‌చల్

ఈపూరు నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్లలో శనివారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ సృష్టించారు. గ్రామంలోని ముస్లిం వీధిలో సయ్యద్ సిలార్‌కు చెందిన పరదాలు కుట్టే మిషన్ చోరీ చేశారు. అనంతరం పఠాన్ ఖాసింబి అనే వృద్ధురాలు మెడలో గొలుసు లాక్కునే ప్రయత్నంలో ఆమె మేల్కొని కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. పది రోజులు నాడు షేక్ మస్తాన్‌కు చెందిన పరదాలు కుట్టే మిషన్ చోరీ జరిగింది. నెల రోజుల్లో గ్రామంలో మోటార్ బైక్, వ్యవసాయ పరికరాలు చోరీకి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు.

సురేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కారంపూడి రోడ్డులో కరెంట్ ఆఫీస్ సమీపంలో 50పడకల సౌకర్యాలతో నిర్మితమైన సురేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను వినుకొండ మాజీ శాసనసభ్యుడు జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ డాక్టర్ అన్నా మణికంఠ సురేష్ ప్రజలకు మెరుగైన వైద్యం నిరంతరం అందించి, ప్రజల ఆదరణను పొందాలన్నారు. అదేవిధంగా వైద్యశాలలో గైనిక్ విభాగాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. డాక్టర్ అన్నా మృదుల తేజస్వి (గ్రంధి) మహిళలకు, అనారోగ్యంతో ఉన్న వారికి నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు.

ఎన్ఈసీలో ఘనంగా ఎన్‌సీసీ డే

నరసరావుపేట కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) ఎన్‌సీసీ 77వ దినోత్సవాన్ని స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేడెట్స్‌కు ప్రత్యేకంగా గేమ్స్, స్పోర్ట్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమం లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ ఆధ్వర్యంలో జరిగింది.

గుంటి ఆంజనేయస్వామి దేవస్థాన ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ ప్రజలు ఇలవేల్పు గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం ముఖద్వారం నిర్మాణానికి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ముఖద్వారానికి నిర్మాణానికి వినుకొండ పట్టణానికి చెందిన అబ్బరాజు వెంకటరామారావు, సువర్చల జ్ఞాపకార్థం వారి కుమారులు అబ్బరాజు మురళీశర్మ, అబ్బరాజు కృష్ణమూర్తి అబ్బరాజు రాజశేఖర్, అబ్బరాజు శ్రీనివాసమూర్తి కుమారుడు అజయ్‌ల విరాళంతో కమిటీ సభ్యులు పనులు ప్రారంభించారు.

పోలేరమ్మ దేవాలయ పునఃనిర్మాణానికి విరాళాలు



విరాళాలు అందజేస్తున్న భక్తులు

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ గ్రామదేవత పోలేరమ్మ దేవాలయ పునఃనిర్మాణానికి భక్తులు ఆదివారం విరాళాలు ప్రకటించారు. ఈ సందర్భంగా పెరుమాళ్ళ లక్ష్మణరావు, మణిశంకర్ రూ1,11,116లు, మాటూరి రామాంజనేయులు, జ్ఞాన ప్రసూన రూ.25,116లు అందచేశారు. చిన్ని ఐరా మూర్తి, సుచరిత దేవాలయ శ్లాబుకు సిమెంటు బస్తాలు, ఒక ట్రాక్టర్ ఇసుకను ఇస్తానని ప్రకటించారు.

రేపు విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీన విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు వినుకొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ పట్టణంలో కారంపూడిలోని చంద్ర షాపింగ్ మాల్ పక్కన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● మండలంలోని విఠంరాజుపల్లిలో 11కేవీ లైన్‌కు సంబంధించి వైర్లు మార్పు సందర్భంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. కావున వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

బొల్లాపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవం సందర్భంగా డిసెంబరు 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆదివారం కమిటీ వారు తెలిపారు. పేర్ల నమోదుకు 9492082098, 8179041557ను సంప్రదించాలన్నారు.



ఈపూరు కేజీబీవీ వసతి గృహం గోడ పైన మొలిచిన మొక్కలు

నిర్లక్ష్యం మానౌవుతోంది...

ఈపూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈపూరు కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల వసతి గృహం గోడలపై మర్రి చెట్లు పెరిగి మానులవుతున్నాయి. మొక్కల వల్ల గోడలు బీటలు వారే పరిస్థితి ఉంది. దీంతో భవనానికి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చెట్లను తొలగించి గోడలను కూలే ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.



కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం.. 1,800 మందికి పరీక్షలు

చిలకలూరిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సేవలో తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెడుతున్న నిస్వార్థపరులు ఆర్టీసీ సిబ్బంది అని, వారి కోసం కంటి వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో సుమారు 1,800 మంది ఆర్టీసీ సిబ్బంది, ఇతరులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య శస్త్రచికిత్సల నిర్వహణ, పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడంలో శంకర కంటి ఆసుపత్రి విశేష కృషి చేస్తోందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి చెప్పారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల విజయవంతం చేయడంలో కంచర్ల శ్రీనివాసరావు పాత్ర ఎంతో ఉందన్నారు. చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ, అభివృద్ధి విషయంలో అన్నివిధాలా తోడ్పడతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం అజిత్ కుమారి, డీఎం రాంబాబు,శిబిరం నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, ఆదంకి వరప్రసాదరావు, పావులూరి వెంకటేశ్వర్లు, ముువ్వా సుబ్బారావు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు స్టేడియం సిద్ధం

● పరిశీలించిన ఎమ్మెల్యే అరవిందబాబు



స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీ నుంచి 69వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలురు, బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. గ్రౌండ్ స్థితిగతులు, మార్కింగ్, గ్రాస్ క్వాలిటీ, డ్రెస్సింగ్ రూమ్స్, దర్శకుల గ్యాలరీ తదితర సౌకర్యాలను తనిఖీ చేశారు. అధికారులతో చర్చించి ఆటలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక యువకులతో కలిసి సరదాగా ముచ్చటిస్తూ, క్రికెట్ ఆడి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రీడా అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మల్లికార్జునుని దర్శించుకున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం దర్శించుకున్నారు. భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం మహాదర్శనం జరిగింది. ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా వేదాశీర్వచనం అందజేసి స్వామివారి ప్రసాదాలు, తీర్థం అందజేశారు.



నరసరావుపేటలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం చూపిస్తున్న వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట శివారులో అధ్వానంగా పారిశుధ్యం

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట శివారు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణంలోని 31వ వార్డు పాలపాడు నుంచి రామిరెడ్డి పేట కనెక్టింగ్ రోడ్డు ఏరియాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 31 వార్డు దర్గా వద్ద నుంచి వల్లప్ప చెరువు వైపుపోయే రోడ్డు పూర్తిగా గుంతలమయమై ఉందని, వాహనాలు ప్రయాణించడానికే కాకుండా పాదచారులకు కూడా ఈ రోడ్డుపై నడవడానికి ఎంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. అదే రోడ్డులో ఒక దూడ చనిపోయి రోడ్డుపై పడిపోయినా ఇప్పటివరకు దాన్ని అక్కడి నుంచి తీసే కార్యక్రమం మున్సిపల్ అధికారులు చేయలేదని, ఆ ఏరియా అంతా దుర్గంధం వ్యాపించిందన్నారు. గతంలో శివారు ప్రాంతాల్లో కొంతభాగం మున్సిపాలిటీలో కలపడం జరిగిందని, వారు మున్సిపల్ పన్నులు సైతం కడుతున్నారని, అటువంటిది వారి వద్ద నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేసి రోడ్లు వేయటం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజల నుంచి డబ్బులు వసూలుచేసి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ఏ రకంగా రేపు ఎన్నికలకు ప్రజల ముందుకు వస్తారన్నారు. తక్షణమే మున్సిపాలిటీ అధికారులు పట్టణ పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, ఎక్కడైతే రోడ్లు గుంతలు పడ్డాయో అక్కడ రోడ్లు వేయాలని, అనధికారికంగా ఉన్న చెత్త డంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గీతమ్స్‌లో నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్- 2025

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్‌లో నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్-2025 ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి జఫ్రూల్లా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గీతమ్స్ హైస్కూల్లో ఉచితంగా జవహర్ నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, రవీంద్ర సుభాని పాల్గొన్నారు.